క్లుప్తంగా

బోడబండలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో తిమ్మగురుడుస్వామి

తుగ్గలి : మీటేతండా సమీపంలోని బోడబండ పుణ్యక్షేత్రంలో వెలసిన తిమ్మగురుడు, పక్కీరప్పస్వామి, శివాలయాల్లో సోమవారం భక్తులు పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వాములకు ఆకుపూజతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రంతా భజనలతో జాగరణ చేశారు. ప్రతి సోమవారం భక్తులు జాగరణ చేస్తారు. ఆలయ ధర్మకర్తలు సుదర్శనరెడ్డి, అప్పా వేణు, పూజారి కృష్ణయ్య ఆచారి పాల్గొన్నారు.

శ్రమదానం


గుంతలను పూడుస్తున్న సాయినగర్ కాలనీవాసులు

మద్దికెర : స్థానిక సాయినగర్‌లో రోడ్డుపై గుంతలు పడి వర్షపు నీరు నిలిచి ఇబ్బందిగా మారడంతో కాలనీవాసులే సోమవారం చందాలు వేసుకొని మట్టిని వేసి గుంతలు పూడ్చారు. కాలనీలో వానలు పడితే నీరు వెళ్లేందుకు డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్డుపైనే పారుతోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ వాసులే సొమ్ము పోగు చేసుకొని మట్టి తెచ్చి తామే పూడ్చామని కరీం, మాబు, శ్రీనివాసులు తెలిపారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు

మద్దికెర : మండలంలోని మదనంతపురం గ్రామంలో సోమవారం మొహర్రంలో భాగంగా పీర్ల చావిడిలో పెద్ద సరిగెత్తు నిర్వహించారు. భక్తులు చావిడికి చేరుకొని పీర్లకు చదివింపులు చదివించుకున్నారు. రాత్రి అగ్నిగుండం చుట్టూ సాహుసేన్ ఆడారు.

విద్యుత్ స్తంభాలను తాకొద్దు

ఆలూరు రూరల్: వర్షాలతో తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లను తాకరాదని ఆలూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఏఈ గురప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌కు తాకుతున్న చెట్లు, కొమ్మలను ముట్టుకోరాదని సూచించారు. అలాగే గృహ వినియోగదారులు ఇంట్లో స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదని, ఉతికిన బట్టలు తీగలపై ఆరవేయరాదన్నారు. గాలికి తెగి పడిన విద్యుత్ తీగలను పట్టుకోవద్దని, ఉరుములు,మెరుపుల సమయంలో టీవీలు, ఫ్రిడ్జ్‌లు ఆఫ్ చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే స్వయంగా మరమ్మతులు చేయకుండా విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

పీజీఆర్ఎస్‌పై అధికారుల నిర్లక్ష్యం

చిప్పగిరి: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం పట్ల పలువురు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కారం చూపాల్సి ఉండగా.. కేవలం కొందరు మాత్రమే హాజరవుతున్నారు. సోవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏఓ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ బాలన్న, వెలుగు ఏపీఎం నాగార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, లైన్ ఇన్‌స్పెక్టర్ యల్లయ్య మాత్రమే హాజరయ్యారు.

పరిశుభ్రతపై శ్రద్ధ వహించండి


రామదుర్గం పాఠశాలలో నీటి సంపును పరిశీలిస్తున్న తహసీల్దార్ పద్మజ

చిప్పగిరి: గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ పద్మజ సూచించారు.సోమవారం మండలంలోని రామదుర్గం గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రధాన కాలనీలను పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ, వీఆర్‌ఓ మల్లికార్జున,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వృథా అవుతున్న ఎల్లెల్సీ నీరు


మోరీ వద్ద లీకవుతున్న నీరు

హాలహర్వి: మండలంలోని బాపురం వద్ద కి.మీ.158–159 వద్ద మోరీ కింద నీరు లీవుతోంది. దీంతో నీరు వృథాగా పోతోంది. లీకేజీపై ఎల్లెల్సీ కాలువ అధికారులు మాట్లాడుతూ బాపురం గ్రామ సమీపంలో స్వల్ప లీకేజీ అయ్యిందని, మంగళవారం మరమ్మతులు చేస్తామని చెప్పారు.

ర్యాగింగ్ కు పాల్పడొద్దు

ఆలూరు: కాలేజీ విద్యార్థులు అమ్మాయిలను ర్యాగింగ్,ఈవ్ టీజింగ్‌కు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆలూరు ఎస్‌ఐ ఓబులేసు తెలిపారు. సోమవారం స్థానిక కాలేజీ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాలేజీ వదలిన అనంతరం కొందరు బైక్‌పై వెళ్తూ అమ్మాయిలను ఈవ్ టీజింగ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలి



అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలి. ఓటాన్ బడ్జెట్‌తో ఇచ్చిన హామీలు అమలుకు నిధులు కేటాయించే పరిస్థితి లేదు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య, వేదావతి,నగరడోణ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు పంటలు సాగు చేసి నెల అవుతున్నా పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందలేదు. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామన్న హామీ నెరవేరలేదు.

– రామాంజనేయులు, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, మొలగవల్లి,గ్రామం,

పథకాలన్నీ కొనసాగించాలి



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలంటే పూర్తి స్థాయి బడ్జెట్ కేటాయించాలి. అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ వల్ల ప్రజలకు ప్రయోజనం లేదు. సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన హామీలన్నీ నెరవేర్చాలి. ఎటువంటి పరిస్థితుల్లో తప్పించుకోవడానికి వీలులేదు. హామీల అమలుకు ఇంత కాలయాపన దేనికి. ఇప్పటికే ఆయా పథకాల సొమ్ము లబ్ధిదారులకు చేరి ఉంటే ప్రభుత్వంపై విశ్వాసం పెరిగేది. నూతన ప్రభుత్వ చర్యలు చూస్తుంటే హామీల అమలుపై నమ్మకం సడలుతోంది.

– మునిస్వామి, ఆలూరు

హామీ అమలు చేయాలి



మా అబ్బాయి కర్నూలులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ ఫస్టియర్, కూతురు పత్తికొండలోని ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ముందే ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. పుస్తకాలు, యూనిఫాం, విద్యా సామగ్రి కొనుగోలు భారంగా మారింది. గత ప్రభుత్వంలో అమ్మఒడి ఎలాంటి ఇబ్బంది లేకుండా అందింది. ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున పిల్లలందరికీ తల్లికి వందనం పథకం కింద చంద్రబాబు ఇస్తామన్నారు. బడులు ప్రారంభమై నెలన్నర గడిచినా ఇంత వరకు ఆ డబ్బులు రాలేదు. సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నాం. – సువర్ణ, ముక్కెళ్ల

కాలయాపన సరికాదు



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరాలంటే పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టాలి. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నెలన్నర కావస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. సోమవారం అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. దాని వల్ల ప్రయోజనం లేదు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలి. తల్లికి వందనం కింద ఒక బిడ్డకు రూ.15వేలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలే కాని గతం గురించి చెబుతూ పథకాలను కాలయాపన చేయకూడదు.

– హనుమంతు ,ఆస్పరి

హామీలు నెరవేరేనా?

- నెలన్నర గడిచినా హామీల అమలుకు మొగ్గు చూపని సర్కారు
- ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో హామీల అమలు ప్రశ్నార్థకం
- ప్రజల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తి


వేదవతి ప్రాజెక్టు పనులు నిలిచిపోవడంతో వృథాగా పైపులు

ఆలూరు రూరల్/ఆలూరు/తుగ్గలి: అధికారంలోకి వస్తే రూ.1,900 కోట్లతో వేదావతి రిజర్వాయర్ పూర్తి చేస్తాం.రూ. 53 కోట్లతో నగరడోణ రిజర్వాయర్ నిర్మిస్తాం.. నియోజకవర్గంలోని తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారం చూపుతాం.. సార్వత్రిక ఎన్నికల ముందు ఏప్రిల్ 19న చంద్రబాబు ఆలూరు నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ప్రకటించిన హామీలు ఇవి. అధికారం చేపట్టి నెలన్నర కావస్తున్నా.. సూపర్ సిక్స్ పేరుతో తల్లికి వందం పథకం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లోకి నగదు జమచేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ పథకం ఊసెత్తడం లేదు. పంటలు సాగు చేసే రైతుకు ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ పంటల సాగు కాలం దాదాపు పూర్తి దశకు చేరుకుంది. ఇచ్చిన హామీల అమలుకు పూర్తిస్థాయి బడ్జెట్‌ను అమలు చేసి పథకాల వారీగా కేటాయింపులు చేయాల్సి ఉండగా.. సోమవారం కేవలం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో సరిపెట్టడం చూస్తుంటే పథకాల అమలుకు ప్రభుత్వం సుముఖంగా లేనట్లుగా అర్థమవుతోంది. ఆలూరు నియోజకవర్గంలో పంటలను జింకలు నాశనం చేస్తున్నాయని, నివారణకు హొళగుంద మండలం దేవరగట్టులో జింకలపార్కు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇక పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి పంటలకు సాగునీరిస్తామని చెప్పారు. ఇవన్నీ నెరవేరే అవకాశం లేదేమోనని ఆయా వర్గాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హామీల అమలు ప్రశ్నార్థకం..

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం నియోజకవర్గానికి ఇచ్చిన హామీల్లో ప్రధానంగా వేదావతి, నగరడోణ రిజర్వాయర్ నిర్మాణాలకు రూ.2 వేల కోట్లు అవసరం అవుతాయి. నిధులతో తాగునీటి సమస్య కూడా పరిష్కారయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాల్సి ఉంటుంది. సంక్షేమ పథకాలు అమలుకు నిధులు వెచ్చించాలి. ఓటాన్ బడ్జెట్ పేరుతో పూర్తి స్థాయి నిధులు లేవని సాకు చెప్పొచ్చన్న ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా 62,217 వేల మందికి రూ.379.41 కోట్లు అందించారు. అమ్మ ఒడి పథకం కింద నియోజకవర్గంలో ఐదేళ్లలో 34,981 మంది పిల్లలకు రూ.141.41 కోట్లు తల్లుల ఖాతాల్లోకి జమ చేశారు. ఇక కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో 62,217 మంది రైతులకు రూ.20 వేల ప్రకారం రూ.124.43 కోట్లు ఏడాదికి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే.. నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 310 ఉన్నాయి. వీటిల్లో 31వేలకు పైగా విద్యార్థులున్నారు. వీరికి ఇంటర్‌మీడియెట్ విద్యార్థులు అదనం. వీరందరికీ తల్లికి వందనం కింద రూ.15వేల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అలాగే..పత్తికొండ నియోజకవర్గంలో 56,447 మంది రైతులకు రూ.304.57 కోట్లు ఐదేళ్లలో రైతుభరోసా కింద అంజేసింది.



కూటమి ప్రభుత్వానిది అంతా బూటకమే

మొదటి నుంచి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చెప్పేది ఒకటి చేసేది మరొకటి. రాష్ట్ర ప్రజలందరికీ ఆయన బుద్ధి తెలుసు. నియోజకవర్గంలో వర్షాధారంపై రైతులు సాగు చేస్తున్న పంటలను జింకల బారినుంచి కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. 2014లో అధికారంలో ఉంటూ ఆలూరు పర్యటనకు వచ్చిన చంద్రబాబునాయుడు తప్పకుండా జింకలపార్కు ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు. అది ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. ఆయకట్టు రైతులకు జలధారను కురిపిస్తాని, వేదావతినదిపై ప్రాజెక్టు నిర్మిస్తానని హామీ ఇచ్చి తుంగలో తొక్కారు. అందుకే ఆయన మాటలకు విలువ లేదు. అయితే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్టుల పనులు చేపట్టడం వీలుకాదని తేలిపోయింది. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలి – బుసినే విరూపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు భరోసా కింద పత్తికొండ నియోజకవర్గంలోని రైతులకు అందిన సొమ్ము

మండలం	రైతులు	ఐదేళ్లలో
పత్తికొండ	10,280.	రూ.69.35 కోట్లు
తుగ్గలి	13,900	రూ.71.04 కోట్లు
మద్దికెర	7,340	రూ.37.07 కోట్లు
కృష్ణగిరి	14,051	రూ.72.02 కోట్లు
వెల్దుర్తి.	10,876	రూ.55.09కోట్లు

మండలాల వారీగా వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పత్తికొండ నియోజకవర్గంలోని తల్లులకు అందిన అమ్మఒడి సొమ్ము

మండలం	విద్యార్థులు	మొత్తం
తుగ్గలి	7,665	రూ. 25.68 కోట్లు
మద్దికెర	4,027	రూ.18.58 కోట్లు
పత్తికొండ	9000	రూ.35.10 కోట్లు
కృష్ణగిరి	5,883	రూ.26.34 కోట్లు
వెల్దుర్తి	7,118	రూ.34.11 కోట్లు

చేతల్లో కనిపించడంలేదు



ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చేలా ప్రభుత్వం వ్యవహరించడం లేదు. మాటకు కట్టుబడి పనిచేసే ప్రభుత్వాలకు మనగడ సాధ్యమవుతుంది. కూటమి ప్రభుత్వం ప్రజలు, రైతులు, కార్మికులకు ఇచ్చిన హామీని నిలుపుకోవాలి. అలా చేయపోతే ప్రజలు తిరగబడతారు.

– ఉప్పర ఈరన్న, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి ఆలూరు

అప్పు చేసి పంట సాగు



మాకు 6ఎకరాల పొలం ఉంది. అప్పుచేసి ఆముదం, కంది పంట వేశాం. గతేడాది కూడా పంటలు పండక నష్టపోయాం. ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి అవుతోంది. గతంలో విత్తనం వేయక ముందే రైతు భరోసా రూ.7,500 వచ్చేది. ఇప్పుడు ఇంత వరకు పెట్టుబడి సాయం రాలేదు. ప్రభుత్వం త్వరగా పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలి.

– గోపాల్‌నాయక్, మీటేతండా

ప్రజలను మోసం చేసి గద్దెనెక్కారు



కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కారు. 50 రోజులైనా ఇంత వరకు ఎలాంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టలేదు. రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తూ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. తల్లికి వందనం పథకాన్ని నీరుగార్చారు. నిరుద్యోగులకు నిరుద్యోగభృతి పథకాన్ని అమలు చేసే చర్యలు చేపట్టలేదు.ఇక ఐదేళ్లపాటు ప్రజలు కూటమి ప్రభుత్వ హామీలు వింటూ గడపాల్సిందేనేమో

– తపాల శ్రీనివాసనాయుడు, దేవనకొండ గ్రామస్తుడు

పథకాలు అమలు చేయకుండా కాలయాపన..



సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేకనే ప్రస్తుత ప్రభుత్వం ఓటాన్ బడ్జెట్ ప్రవేశపెడుతోంది. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక కాలయాపన కోసం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం లేదని అర్థమవుతోంది. ప్రతి నిరుద్యోగికి భృతి కింద రూ.3 వేలు ఇవ్వాల్సి ఉంది. రైతు పెట్టుబడి సాయం కింద రూ.20వేల ప్రకారం ఇవ్వాల్సి ఉన్నా నెరవేరలేదు. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెడితే తప్పా పథకాలు అమలు కావు.

– దానాల రాజు, నిరుద్యోగి, ఆలూరు

పెట్టుబడి సహాయం అందించాలి



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద అందిస్తామన్న రూ.20వేలు ఇవ్వలేదు. విత్తనం వేసే సమయంలో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తే ఉపయోగ పడుతుంది. గత ప్రభుత్వం రైతు భరోసా కింద ఖరీఫ్ సీజన్ ప్రారంభయ్యే సమయానికి రైతులు ఖాతాలో డబ్బులు జమ చేశారు. ప్రస్తుతం చాలా మంది రైతులు అప్పులు చేసి విత్తనం వేసుకున్నారు. ప్రభుత్వం చొరవ చూపాలి.

– ఉశేని రైతు, డి.కోటకొండ, ఆస్పరి మండలం

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి



కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఎంతో నమ్మకంతో పట్టం గట్టారు. ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చేందుకు పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి వాటికి నిధులు కేటాయించాలి. ఓటాన్ అకౌంటు బడ్జెట్ ద్వారా కొంత కాలం వరకు మాత్రమే వీలవుతుంది. దీని వల్ల అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరగదు. నిధులు కేటాయించి రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలి.

– నెట్టికల్, ఎంపీటీసీ, హోసూరు

హామీలు నెరవేర్చకపోతే ప్రజల్లోకి రాలేరు



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే జనాల్లో తిరగలేరు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో పాలన ఎలా కొనసాగిస్తారో అంతు చిక్కడంలేదు. ఏదైనా సరే ప్రజలకు ఇచ్చిన మాటకుకట్టుబడి కొనసాగిస్తే పాలన సాగించాలి. విద్యార్థుల తల్లిదండ్రులకు తల్లికి వందనం , ఖరీఫ్ పంట సాగుకు రైతులకు పెట్టుబడి సహాయం కింద పెంచిన రైతు భరోసా ఇప్పటివరకు విడుదల చేయలేదు.

– నారాయణస్వామి , ఆలూరు

ప్రారంభమైన శిక్ష సప్తాహ్


బోధన సామగ్రిని ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు


రామలింగాయపల్లిలో శిక్ష సప్తాహ్‌లో పాల్గొన్న విద్యార్థులు


హొళగుంద జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు చేసిన నమూనాలు

తుగ్గలి : నూతన జాతీయ విద్యా విధానం లక్ష్యాలను మరింత విస్తృతం చేసేందుకు ప్రభుత్వం శిక్ష సప్తాహ్ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమం సోమవారం పాఠశాలల్లో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆయా పాఠశాలల్లో ఉన్న స్థానిక వనరులతో విద్యార్థులు తయారు చేసిన బోధన సామగ్రిని ప్రదర్శించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ (విద్యా వారం) నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్ : స్థానిక వనరులతో బోధన జరిగితే విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెరుగుతుందని పత్తికొండ బాలికల జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం భ్రమరాంభ అన్నారు. సోమవారం 'శిక్ష సప్తాహ్' కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడుతూ బోధనలో స్థానిక వనరుల ప్రాముఖ్యతను టీచర్లకు, విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు వివిధ రకాలైన బోధన సామగ్రి నమూనాలు తయారు చేసి కార్యక్రమంలో ప్రదర్శించారు.

హొళగుంద: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నుంచి శిక్ష సప్తాహ్ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, టీచర్లు పలు అంశాలకు సంబంధించిన బోధన సామగ్రిని తయారు చేసి ప్రదర్శించారు. ఎంఈఓలు సత్యనారాయణ, జగన్నాథం, హెచ్‌ఎం నజీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న డిప్యూటీ పారా మెడికల్ అధికారి గురుప్రసాద్

ఆలూరు: సీజనల్ వ్యాధులు సోకకుండా గ్రామాల్లో ప్రజాప్రతినిధులతో కలసి ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి గురుప్రసాద్, మొలగవెల్లి గ్రామ పీహెచ్ కేంద్రం సూపర్ వైజర్ ఆండ్రూస్ ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. ఆలూరు సచివాలయం-2 లో వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లతో సమావేశమయ్యారు. గురుప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో కుష్టు వ్యాధి నివారణ, అంటువ్యాదులు సోకకుండా నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హొళగుంద: మార్లమడికి వద్ద ఉన్న వేదావతి నది నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను హొళగుంద పోలీసులు పట్టుకున్నారు. ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన వ్యక్తులు నదిలో అక్రమంగా ఇసుక తవ్వుకుని తీసుకెళ్తున్నారనే సమాచారం మేరకు ఎస్‌ఐ పెద్దయ్య నాయుడు, సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని తదుపరి చర్యలు వారు తీసుకుంటారని పేర్కొన్నారు.

ముళ్ల కంప తొలగింపు

దేవనకొండ: స్థానిక శ్మశానంలోకి వెళ్లేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. రహదారికి ఇరువైపులా ముళ్లకంపలు పెరిగిపోవడంతో రాకపోకలకు అవస్థలుపడేవారు. స్పందించిన సర్పంచ్ రంగలక్ష్మి సోమవారం రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలను జేసీబీతో తొలగించారు.

హాస్టల్‌ను పునః ప్రారంభించాలి

దేవనకొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహాన్ని పునఃప్రారంభించాలని, బీసీ బాలికల వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పత్తికొండ–దేవనకొండ రహదారిపై విద్యార్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలం నిత్యం కరువు కాటకాలతో సతమతమవుతోందన్నారు. అలాగే డీఎస్టీ హాస్టల్ గత 40 సంవత్సరాలుగా ఉండేదని, గృహం లేదన్న సాకుతో మూసివేశారన్నారు. ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మధు, మనోజ్, సురేంద్ర, అరవింద్, మహేష్, రాము పాల్గొన్నారు.

అధికారులు హాజరు కావాల్సిందే

మద్దికెర : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు రాకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ రజాక్‌వలి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల మండల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఏపీఓ నర్సిరెడ్డి, ఏఈలు ఉమాకాంత్, మాయంక్, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

హాలహర్వి: కేంద్ర ప్రభుత్వం ఆడపిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని పోస్టాఫీసు ఎస్‌పీఎం భాస్కర్ సూచించారు. సోమవారం ఆయన స్థానిక పోస్టాఫీసులో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఈ పథకంలో పెట్టుబడి చేస్తే 8.4 శాతం వడ్డీ రేటు లభిస్తోందన్నారు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలు కూడా పొందొచ్చన్నారు. ఈ పథకంపై లభిస్తున్న వడ్డీ రేటు ప్రతి మూడు నెలలకోసారి మారుతుంటుందని చెప్పారు. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు (నెలకు రూ.12,500) వరకు అకౌంట్‌లో డిపాజిట్ చేయాలన్నారు. నెలకు రూ.1000 నుంచి రూ.12 వేలు మధ్యలో చెల్లిస్తే మెచ్యూరిటీ తర్వాత రూ.6 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు పొందవచ్చని వివరించారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలివ్వాలి

హొళగుంద: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలివ్వాలని, మధ్యాహ్న భోజన పథకం తిరిగి ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్యాట శ్రీరంగ, మండల కార్యదర్శి సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయకపోవడం వల్ల పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజేష్, మల్లయ్య, రాజు, అజయ్ పాల్గొన్నారు.

దుకాణాల కోసం దళారులను ఆశ్రయించొద్దు

ఆలూరు రూరల్: ఈ నెల 27న సంతమార్కెట్‌లోని 27 దుకాణాలను బహిరంగ వేలాల ద్వారా కేటాయిస్తామని, వ్యాపారులు దుకాణాల కోసం దళారులను ఆశ్రయించవద్దని మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ ప్రకాష్ నాయుడు తెలిపారు. సోమ వారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. షరతులకు లోబడి వేలం పాటలు నిర్వహిస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షాపు నంబర్ 1 – 10, 17 – 22 వరకు రూ.3,800 నుంచి వేలం పాడాల్సి ఉంటుందని చెప్పారు. అలాగే షాపు నంబర్ 11 – 16, 22–27 వరకు రూ.2,700 వేలం పాట అప్‌సెట్ ప్రైస్ నిర్ణయిస్తూ ఉత్తర్వులు ఇచ్చామన్నారు. పాల్గొనే వారు ఈ నెల 26న సాయంత్రం 5 గంటల లోపు డిపాజిట్ రూ.50 వేలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

కృష్ణగిరి: కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో మంగళవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు ఎంపిక చేసిన గ్రామ సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓలు రాబర్ట్ విల్సన్, శివశంకరప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి మండలంలో వెల్దుర్తి–3, రామళ్లకోట, గోవర్ధనగిరి–2, లక్ష్మినగరం, కృష్ణగిరి మండలంలో ఎరుకలచెరువు, కృష్ణగిరి, చిట్యాల గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తుగ్గలి : ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు మంగళవారం నుంచి 27వ తేదీ వరకు గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ చేయనున్నట్లు చెప్పారు.

ఉపాధ్యాయులను నియమించాలి


తహసీల్దార్ ఈరమ్మకు వినతి పత్రం ఇస్తున్న బైలుపత్తికొండ గ్రామస్తులు

ఆస్పరి: మండలంలోని బైలుపత్తికొండ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యలయంలో తహసీల్దార్ ఈరమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. సీపీఎంఎల్ ఆలూరు నియోజకవర్గ కార్యదర్శి .మునిస్వామి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 1–5వ తరగతి వరకు 62 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. వీరందరికి ఒకే ఉపాధ్యాయురాలు ఉండడంతో తరగతులు బోధించడానికి ఇబ్బందిగా ఉందన్నారు. విషయాన్ని విద్యాశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు లేకపోతే విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే అవకాశముందన్నారు. గ్రామస్తులు ప్రభాకర్, ఈరన్న, నరసప్ప, రంగన్న ఉన్నారు.

25న వాహనాల వేలం

ఆలూరు రూరల్: సెబ్ పరిధిలోని 5 మండలాల్లో అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన 6 ద్విచక్ర వాహనాలను ఈ నెల 25వ తేదీన బహిరంగ వేలం వేస్తున్నట్లు ఆలూరు సెబ్ సీఐ సోమశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సెబ్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఉదయం వేలం ఉంటుందని పాల్గొనే వారు రూ.3 వేలు చెల్లించాలని సూచించారు.